ప్రజాశక్తి
శనివారం 13 ఏప్రిల్ 2024
5
శ్రీకాకుళం



ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ప్రజాశక్తి - పొందూరు

గ్రామాల్లో సమస్యలు లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జాయింట్ కలెక్టర్, ఆమదాలవలస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ అన్నారు. మండలంలోని తుంగపేటలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అధికారులు ముందుగానే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగదు అక్రమ రవాణా కాకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, ఎంఇఒ రామరాజు తదితరులున్నారు.



డి.ప్రేమ్ చరణ్
990 / 1000



రిషికా ఆచారి
989 / 1000



పి.సందీప్
989 / 1000



వి.లీలా కుమారి
466 / 470



ఎం.వి.వి.ఎస్ సంహిత
466 / 470

బాలికలదే హవా

- ప్రథమ, ద్వితీయం రెండింటిలోనూ ముందంజ
- ద్వితీయంలో 73 శాతం, ప్రథమంలో 63 శాతం ఉత్తీర్ణత
- ప్రథమంలో స్టేట్ టాపర్గా చింతు రేవతి
- 466 మార్కులతో జిల్లా టాపర్గా లీలాకుమారి
- ద్వితీయంలో 990 మార్కులతో అదరగొట్టిన ప్రేమ్ చరణ్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలు 73 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 60 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో బాలికలు 63 శాతం మంది పాస్ కాగా, బాలురులో 49 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికల్లో ఉత్తీర్ణత శాతంతో జిల్లా పరువు దక్కింది. లేకుంటే ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలిచేది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 21వ స్థానం దక్కింది. పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ప్రథమ సంవత్సరంలో జిల్లాకు చెందిన చింతు రేవతి స్టేట్ టాపర్గా నిలిచారు. 470 మార్కులకు గానూ 467 మార్కులు సాధించారు. శ్రీకాకుళం రూరల్ మండలం తంగివానిపేటకు చెందిన వి.లీలా కుమారి ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గానూ 464 మార్కులు సాధించి జిల్లా టాపర్గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి విభాగంలో డి.ప్రేమ్ చరణ్ 1000 మార్కులకు గానూ 990 మార్కులు సాధించారు.



తల్లిదండ్రులతో స్టేట్ టాపర్ చింతు రేవతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 16,769 మంది హాజరు కాగా 11,300 మంది (67 శాతం) మంది పాసయ్యారు. వీరిలో 9,362 మంది బాలికలకు గానూ 6,849 మంది ఉత్తీర్ణత (73 శాతం) సాధించారు. బాలురుల్లో 7,407 మంది పరీక్షలు రాయగా 4,451 మంది (60 శాతం) పాసయ్యారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు మొత్తం 18,249 మంది హాజరు కాగా 10,408 మంది (57 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలికలు 10,250 మంది పరీక్షలు రాయగా 6,461 మంది (63 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురుల్లో 7,999 మంది పరీక్షలకు హాజరు కాగా 3,947 మంది (49 శాతం) మంది పాసయ్యారు.

ఒకేషనల్‌లోనూ బాలికలదే పైచేయి

ఒకేషనల్ రెండో సంవత్సరం పరీక్షలకు 1078 మంది హాజరు కాగా 797 మంది (74 శాతం) పాసయ్యారు. ఇందులోనూ బాలికలదే పైచేయిగా ఉంది. పరీక్షలకు 643 మంది బాలికలు హాజరు కాగా 553 (86 శాతం) పాసయ్యారు. 435 మంది బాలురు పరీక్షలు రాయగా, 244 మంది (56 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 1103 మంది హాజరు కాగా 730 మంది (66 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో బాలికలే అత్యధిక మంది పాసయ్యారు. పరీక్షలకు 613 మంది బాలికలు హాజరు కాగా 511 మంది (83 శాతం) హాజరయ్యారు. 490 మంది బాలురు హాజరు కాగా, 219 మంది (45 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమంలో స్టేట్ టాపర్గా చింతు రేవతి

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో జిల్లాకు చెందిన చింతు రేవతి స్టేట్ టాపర్గా నిలిచారు. 470 మార్కులకు గానూ 467 మార్కులు సాధించారు. ప్రస్తుతం ఈమె విశాఖలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నారు. కోటబొమ్మాళి మండలం సుబ్బారావు గ్రామం వీరి స్వస్థలం. ఈమె తండ్రి సిహెచ్.కృష్ణమూర్తి, తల్లి జయమ్మ ఇరువురూ వ్యవసాయం చేస్తున్నారు. ఆమె నరసన్నపేటలోని ఓ ప్రయివేట్ కళాశాలలో చదివి 581 మార్కులు సాధించారు.

జిల్లా టాపర్గా లీలా కుమారి

ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపిసి విభాగంలో శ్రీకాకుళం రూరల్ మండలం తంగివానిపేటకు చెందిన వెలమల లీలా కుమారి జిల్లా టాపర్గా నిలిచారు. 470 మార్కులకు గానూ 466 మార్కులు వచ్చాయి. ఈమె తండ్రి గోపి వ్యవసాయం చేస్తుండగా, తల్లి రాములమ్మ గృహిణి. లీలాకుమారి శ్రీకాకుళం నగరంలోని గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతిలో 584 మార్కులు సాధించారు. ఇంజినీరింగ్ చేయాలని అనుకుంటున్నానని ఆమె చెప్పారు.

అదరగొట్టిన ప్రేమ్ చరణ్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురానికి చెందిన డి.ప్రేమ్ చరణ్ 1000 మార్కులకు గానూ 990 మార్కులు సాధించారు. తండ్రి ఏడుకొండలు కార్పెంటర్‌గా పనిచేస్తుండగా, తల్లి కృష్ణపాప గృహిణి. సోంపేట సంస్కార భారతిలో చదువుతున్న రిషిక ఆచారి 989, పి.సందీప్ 989 మార్కులు వచ్చాయి. ద్వితీయ సంవత్సరం బైపిపిలో సాధు భార్గవి 979 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎం.వి.వి.ఎస్ సంహిత, పి.రాహుల్‌కు 470 మార్కులకు గానూ ఇరువురికీ చెరో 465 మార్కులు వచ్చాయి.

జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం వివరాలు

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు	శాతం
2019-20	28,818	14,380	50
2020-21	29,729	29,729	పాస్ (కరోనా)
2021-22	26,052	14,729	57
2022-23	21,752	14,019	64
2023-24	16,769	11,300	73

పలు యాజమాన్యాల కళాశాలలు సాధించిన ఫలితాల వివరాలు

(ఇంటర్ ప్రథమ సంవత్సరం)

కేటగిరీ	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ కళాశాలలు	4,480	1826	40.76
సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్	528	390	73.86
గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్	82	35	42.68
మోడల్ స్కూల్స్	1034	653	63.15
కెజిబివి	631	404	64.03
ప్రయివేట్ కళాశాలలు	11,273	7,012	62.20

(ఇంటర్ ద్వితీయ సంవత్సరం)

కేటగిరీ	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ కళాశాలలు	4,001	2,355	58.86
సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్	536	450	83.96
గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్	84	37	44.05
మోడల్ స్కూల్స్	929	675	72.66
కెజిబివి	607	448	73.81
ప్రయివేట్ కళాశాలలు	10,587	7,323	69.17

5న ఓట్ ఫ్రమ్ హోం

- వికలాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు అవకాశం
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మే 5 నుంచి ఎనిమిదో తేదీ వరకు నాలుగు రోజుల పాటు జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్ ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. హోం ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియ)కు సానుకూలంగా ఉన్న 85 ఏళ్ల పైబడిన, వికలాంగ ఓటర్ల వివరాలను ఆయా రిటర్నింగ్ అధికారుల (ఆర్ఒ)కు అందజేయాలన్నారు. ఏ ఒక్కరూ ఓటు వేయలేకపోయామని బాధపడే పరిస్థితి ఉండకూడదన్నదే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఆర్ఒలు, ఎఆర్ఒ (తహశీల్దార్లు), సెక్టార్ అధికారులు, బిఎల్ఒలు, సూపర్‌వైజర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నాటికి అర్హులైన వారి జాబితా సిద్ధమవుతుందని, 14వ తేదీన దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. 15, 16, 17 తేదీల్లో 12-డి దరఖాస్తును బిఎల్ఒలు స్వయంగా ఆయా ఓటర్ల వద్దకు వెళ్లి అందజేయాల్సి ఉంటుందన్నారు. వీటిని ఈ నెల 22వ తేదీ నాటికి బిఎల్ఒలు, సెక్టారు అధికారులు సంయుక్తంగా తిరిగి వెళ్లి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించాలన్నారు. హోం ఓటింగ్ కావాలో? వద్దో? వారి నుంచి హామీ పత్రం తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో నమోదైన వయసు ఆధారంగా తీసుకుని 85 ఏళ్ల పైబడిన హోం ఓటింగ్ కావాలనే వారు, సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం పైబడి ఉన్న వికలాంగుల నుంచి మాత్రమే 12-డి ఫారంపై అంగీకార పత్రాలు తీసుకుని ఆర్ఒ కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. వారందరికీ ఇంటి వద్దనే మే 5 నుంచి 8వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా పరిషత్ సిఇఒ డి.వెంకటేశ్వరరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జి.వి.చిట్టిరాజు, శిక్షణా కార్యక్రమాల సమన్వయకర్తలు బాలాజీ నాయక్, ఎం.కిరణ్ కుమార్, ఇడిఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. ఎఆర్ఒలు, బిఎల్ఒలు మండలాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - బూర్జ, సరుబుజ్జిలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. బూర్జ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదనాపురం జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీకాకుళం-పాలకొండ రహదారి మార్గంలో వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న తీరు, వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు వాహన తనిఖీలకు సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా అనుమానాస్పద వాహనాలు అన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, గంజాయి, నాటుసారా వంటి నిషేధిత ఉత్పత్తుల రవాణాను అరికట్టాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎక్కువగా నగదు లభిస్తే, తగిన ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టే వస్తు సామగ్రి పట్టుబడితే వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. రాత్రివేళ రేడియం జాకెట్ ధరిస్తూ వాహనాలు తనిఖీ చేయాలన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది విధులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మతలబుపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, మౌలిక వసతులపై ఆరా తీశారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంతంగా ఓటు వేసేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తొలి విడత ఇవిఎం రాండమైజేషన్ పూర్తి

శ్రీకాకుళం : మొదటి విడత ఇవిఎం రాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్‌లో పూర్తయిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఇఎంఎస్ 2.0 నిర్దేశిత వెబ్‌సైట్‌లో పూర్తి చేసినట్లు వివరించారు. సాంకేతికపరంగా ఎటువంటి లోపాలకు తావులేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఇవిఎంల నోడల్ అధికారి, జిల్లా పాధికల్పనాధికారి కె.సుధ, సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

విభేదాలు వీడండి


వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి అభ్యర్థుల గెలుపునకు విభేదాలు వీడి సమిష్టిగా పనిచేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలోని పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని శాసనసభ స్థానాల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గాల వారీగా అసంతృప్త నేతలతో సమావేశమయ్యారు. ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి భర్తపై ఫిర్యాదు చేశారు. అభ్యర్థి పిరియా విజయ కోసం పనిచేస్తున్నందునే తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఆమదాలవలస నియోజకవర్గంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, కోట గోవిందరావుతో మాట్లాడి నియోజకవర్గంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను సమన్వయం చేసుకోవడంలో చాలామంది అభ్యర్థులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది సరికాదని సుబ్బారెడ్డి అన్నారు. అసెంబ్లీ పరిధిలో పంచుతున్న కరపత్రాల్లో ఎంపీ అభ్యర్థి పేరు, ఫొటో కచ్చితంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ అభ్యర్థికి మాత్రమే ఓటు వచ్చి, ఎంపీ అభ్యర్థికి రాకపోయినా పర్వాలేదన్న కోణంలో వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. గతంలో ఇలాగే ఎంపీ స్థానాన్ని కోల్పోయామని గుర్తుచేశారు. ఎన్నికలకు ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉందని అలకలు వీడి అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఇంటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అభ్యర్థులే ప్రచారం చేస్తారని చూడొద్దని, సచివాలయ పరిధిలో నాయకులు ప్రతిరోజూ ప్రచారం చేయాలని చెప్పారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఉప సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలు అభివృద్ధి చెందకుండా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీల్లో ఉన్న వారు నాయకులుగా నిరూపించుకునేందుకు ఎన్నికలే కొలమానమన్నారు. వాలంటీర్లతో రాజీనామాలు చేయించి పార్టీ కోసం పనిచేయించాలని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని తిగిరి వాలంటీర్లుగా నియమిద్దామన్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, వి.కళావతి, గొర్లె కిరణ్ కుమార్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థులు దువ్వాడ శ్రీనివాస్, పిరియా విజయ, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, మీసాల నీలకంఠంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

15 చంద్రబాబు రాక?



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 15న జిల్లాకు రానున్నట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస, టెక్కలిలో నిర్వహించనున్న ప్రజాగళం సభలో ఆయన పాల్గొనున్నట్లు సమాచారం.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- వేసవిలో ప్రతిరోజూ 'ఉపాధి'
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేసవిలో ప్రజలకు నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీటి పథకాలు పని చేయలేదనే ఫిర్యాదు ఒక్కటీ ఉండకూడదని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రణస్థలం, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో భూగర్భ జలాల లభ్యత గురించి అడిగారు. నీటి నాణ్యతను గురించి పరీక్షలు నిర్వహించాలన్నారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతమనే తేడా చూపకుండా తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి నీటి సరఫరా వ్యవస్థ అయినా పనిచేసేలా ఉండాలని, మరమ్మతులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. నీటి కొరత ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద పెంచిన కూలితో ఎంతో ప్రయోజనం ఉంటుందని, ఎక్కువ మంది ప్రయోజనాలు అందుకునేలా చూడాలని ఆదేశించారు. ఏడాదికి వంద రోజుల పని, రూ.300 కూలి జిల్లాలో 1.82 లక్షల మంది ఉపాధి హామీ లబ్ధిదారులకు అందుతుందని చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపిడిఒలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కొత్తగా ప్రతిపాదించిన పనులను గుర్తించి, ప్రతిరోజూ అన్ని పంచాయతీల్లో పనులు జరగాలన్నారు.

వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, డిమాండ్‌కు తగ్గ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డిపిఒ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.జె బెనహర్, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇంజినీర్ పి.సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన తొమ్మిది గ్యారంటీల మేనిఫెస్టో పోస్టర్‌ను శుక్రవారం పార్టీ శ్రీకాకుళం అభ్యర్థి పైడి నాగభూషణరావు ఆవిష్కరించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను కేంద్రంలో ఉన్న బిజెపి అమలు చేయకపోయినా ఇక్కడున్న ప్రాంతీయ పార్టీలు వారితో జతకట్టి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రైతు రుణమాఫీ రూ. రెండు లక్షలు, ప్రత్యేక హోదా 10ఏళ్లు, ఇళ్లు లేని కుటుంబాలకు రూ.ఐదు లక్షలు, ఉచిత విద్య కెజి టు పిజీ వరకు, వృద్ధులకు వితంతువులకు రూ.4 వేల పింఛను, వికలాంగులకు రూ. 6వేల పింఛను, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400 వంటి హామీలను అమలు చేస్తామన్నారు. ప్రజలు ఆదరిస్తారన్నా నమ్మకంతో కాంగ్రెస్ శ్రేణులు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగభూషణరావు

పోర్టు పనులకు నీరు తరలించం

తీర్మానించిన యామలపేట గ్రామస్తులు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యామలపేట గ్రామంలోని వ్యవసాయ బోర్లలో ఉన్న నీటిని, భూగర్భ జలాలను తమ గ్రామ అవసరాలకే వాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్, కార్యదర్శి కేశవరావు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని వ్యవసాయ నిమిత్తం వేసిన బోర్ల నుంచి మూలపేట పోర్టుకు, ఇతర కార్యక్రమాలకు అమ్ముకోకుండా నిబంధనలు విధిస్తూ తీర్మానించారు. తమ గ్రామ సమీపంలో ఎన్నో ఏళ్లగా ఉన్న ఎన్ఎస్ కంపెనీలో గ్రామస్తులు 200 మంది వరకు ఉపాధి పొందడంతో ఆ కంపెనీకి మినహాయించి వేరే ఇతర కార్యక్రమాలకు నీటిని తరలించకూడదని నిర్ణయించారు. కాగా, ఈనెల 11న గ్రామంలోని బోర్ల ద్వారా తాగునీరు బయట గ్రామాలకు తరలింపును వ్యతిరేకిస్తూ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు, యువత నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు భూగర్భ జలాలు అందక గ్రామంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని గుర్తించిన గ్రామస్తులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ తీర్మానాన్ని పంచాయతీ కార్యదర్శి ద్వారా ఎంపిడిఒకు పంపిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ సర్పంచ్ జగన్నాథరావు, మాజీ సర్పంచ్ మధు, మోహనరావు, ఎల్.రామిరెడ్డి, జి.భాస్కరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్యదర్శి కేశవరావు

మార్కులే జీవితానికి ప్రామాణికం కాదు

ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులు కానివారు, ఎక్కువ మార్కులు రాలేదని ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షల్లో మార్కులే జీవితానికి ప్రామాణికం కాదన్నారు. ప్రతిఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి కృషి చేస్తే జీవితంలో ఇంకా ఎంతో ఎదగవచ్చని ఎత్తుకు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో అబ్బాయిల కంటే అమ్మాయిలదే పైచేయి కావడం ఎంతో ఆనందకరమైన విషయమని, బాలిక విద్య అభ్యున్నతికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే జీవితాల్లో ఫెయిల్ అయినట్లు కాదన్నారు. ఫెయిలైన వారికి సప్లిమెంటరీ, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు బెటర్మెంట్ ద్వారా అవకాశముందన్నారు. పిల్లలకు తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు కొట్టడం, మానసికంగా బాధించడం సరికాదన్నారు. వారిలోని ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బెదిరింపులపై ఫిర్యాదు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావుకు మున్సిపాలిటీ పరిధిలోని నీలావురం కాలనీకి చెందిన శ్రీరంగం సురేష్, మరొకరు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఫోన్ చేసి నానా దుర్భాషలాడుతూ నిన్ను చంపుతామని ఫోన్‌లో బెదిరించారని, శుక్రవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరంగం సురేష్ వ్యక్తి కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం అభ్యర్థిగా టిక్కెట్ ఆశించి దరఖాస్తు కూడా చేసి ఉన్నాడని, అయితే పార్టీ అధిష్ఠానం ఇటీవల పలాస కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మజ్జి త్రినాథబాబుకు ప్రకటించిందని తెలిపారు. దీంతో పార్టీ టిక్కెట్ ఇప్పి ఉంటే తన లక్షల మొత్తం ఖర్చు వచ్చి ఉండేదని, పార్టీ టిక్కెట్ రాకుండా చేసి నా కడుపు కొట్టావని దుర్భాషలాడారని అన్నారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు శ్రీరంగం సురేష్‌ను పిలిపించి విచారించారు.

ఎడెక్స్ కోర్సులపై సమీక్ష

ఎచ్చెర్ల: ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎడెక్స్ కోర్సులపై ఉన్నత విద్యామండలి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించింది. వర్చువల్ మోడ్ లో జరిగిన ఈ సమావేశంలో డా. బిఆర్ఎయు నుంచి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు. ఎడెక్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరిక, వీటిపై అవగాహన మరింత వేగవంతం చేయాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్ర రెడ్డి, వైస్ ఛైర్మన్ ఆచార్య ఉమామహేశ్వరిలు సూచించారు. బిఆర్ఎయు పరిధిలో విద్యార్థులు నమోదు శాతం అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీతో పాటు అనుబంధ కళాశాలలో ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా ఎడెక్స్ కోర్సుల్లో తమ పేర్లు విద్యార్థులు నమోదు చేసినట్లు తెలియజేశారు. వర్సిటీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ సిహెచ్ రాజశేఖరరావు, రామకృష్ణ, విద్యాసాగరరావు పాల్గొన్నారు.

కృపారాణిని కలిసిన శైలజ

టెక్కలి : టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కిల్లి కృపారాణిని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు, న్యాయవాది కొత్తూరు శైలజ శుక్రవారం ఆమె నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కృపారాణి, రామ్మోహనరావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈమెతో పాటు టి.బి.జె.గుప్త, చౌక్కాకుల జీవన్, దవళ అభిరామ్ ఉన్నారు.

విజ్ఞానం అవసరం

ఎచ్చెర్ల: విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం అవసరం అని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ అన్నారు. ట్రిపుల్ ఐటిలో శుక్రవారం ట్రిపుల్ ఐటిలో జరుగుతున్న టెక్ని వెర్స్ ఫెస్ట్‌ను డ్రోన్ వర్క్‌షాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ అనేది ఆధునిక సాంకేతిక కలిగిన డ్రోన్ అని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ దారులు ఎరువులను మనుషులతో పని లేకుండా డ్రోన్ ద్వారా స్ప్రే చేసుకోవచ్చునన్నారు. వరదల సమయంలో ఆహారం, మందులు పంపిణీ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ, చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో-కన్వీనర్ దిలీప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ, తిరుపతమ్మ, పిఆర్ఒ షణ్ముఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

అదరగొట్టిన 'ఆదిత్య'


చాందిని మౌనిక విద్యారెడ్డి

ఇచ్ఛాపురం : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఇచ్ఛాపురంలోని ఆదిత్య జూనియర్ కళాశాల విజయా దుందుభి మోగించింది. రాష్ట్రస్థాయిలో మూడోవ స్థానం, జిల్లాలో రెండు, నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించింది. కొంతల విద్యారెడ్డి ఎంపిసిలో సత్తా చాటింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కొంతాల్ విద్యారెడ్డి 464/470 మార్కులు, నెయ్యిల భవ్యశ్రీ 460/470, దక్కత శైలజ 460/470, రామిశెట్టి మేఘన 460/470, బైపిసిలో దక్కత సంతోషి భవాని 428/440, ఉప్పాడ శ్రావణి 425/440 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో నెయ్యిల చాందిని 984/1000, మౌనిక 984/1000, కొత్త జాన్సి 983, పొందర్ శ్రావణి బాదిత్య 981, ఇసురు గౌతమి 980 మార్కులు సాధించారు.

'స్వర్ణభారతి' సత్తా

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్వర్ణ భారతి జూనియర్ కాలేజ్ విద్యార్థులు పట్టణ స్థాయిలో విజయ కేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో అన్వేషి త్రిపాఠి 458/470 ప్రథమ, పాల శ్రేయ 457/470 ద్వితీయ స్థానంలో నిలిచారు. బైపిసి ప్రథమ సంవత్సరంలో నమిత గజపతి 428/440 ప్రథమ, అంకితనంద 425/440 ద్వితీయ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నందికి రాధారెడ్డి 973 మొదటిస్థానంలో, ఆల్లా స్నేహదార 968 ద్వితీయస్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో 400 పైగా మార్కులు సాధించిన వారు 32 మంది, ద్వితీయ సంవత్సరంలో 900 పైగా మార్కులు సాధించినవారు 19 మంది ఉత్తీర్ణ సాధించారు. ఇంతటి అద్భుత ఫలితాలు సాధించడంపై విద్యా సంస్థల ఛైర్మన్ చాట్ల తులసీదాసురెడ్డి అభినందించారు.

'విశ్వజ్యోతి' విజయదుందుభి


చంద్రశేఖర్ భరత్‌కుమార్

టెక్కలి : ఇంటర్ ఫలితాల్లో విశ్వజ్యోతి జూనియర్ కళాశాలలో చదువుతున్న బమ్మిడి చంద్రశేఖర్ 464 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రమీల తెలిపారు. నెల్లిపర్తి భరత్‌కుమార్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 989 మార్కులు సాధించారని అన్నారు. తమ కళాశాలలో 80 శాతం పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ దుప్పల రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

ప్రయివేట్ కళాశాలల విజయభేరి

కవిటి: స్థానిక కళ్యాణి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో పి,కీర్తిశ్రీ 980, టి.కీర్తి 977 మార్కులు సాధించగా, బైపిసి విభాగంలో బి.జ్యోత్స్న 965, సిహెచ్.మౌనిక 961 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపిసిలో జి.హేమలత 457, ఎస్.బాలు 444 మార్కులు సాధించారు. మొదటి సంవత్స రంలో 165 మందికి 133 గురు, ద్వితీయ సంవ త్సరంలో 133 మందికి 115 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కల్యాణి కళాశాల యాజమాన్యం తెలిపింది.కవిటి కొత్తూరులోని బిఎస్ఆర్ కళాశాలలో వజ్జ స్వాప్నిక ఎంపిసిలో 453 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో శివంగి షణ్ముఖరావు 896 మార్కులు సాధించాడు. మొత్తంగా ప్రథమ సంవత్సరంలో 19 మందికి 16 మంది, ద్వితీయ సంవత్సరంలో 32 మందికి 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎస్‌విజె కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో దూగాన ప్రభ 907, కోట శ్రీనాథ్ 899, తెప్పల కావ్య 887, ముత్యాల మేఘన 868 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం బైపిసిలో పైల గాయత్రి 408, పిట్ట పల్లవి 348 మార్కులు సాధించారు.

'సంస్కార భారతి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట పట్టణానికి చెందిన సంస్కార భారతి విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లు ప్రతిభ చూపారని ఛైర్మన్ వై దేవరాజు, కరస్పాండెంట్ దాసు తెలిపారు. ప్రథమ సంవతర్సరంలో బి.రాహుల్ 460 మార్కులు, బి.అనురాధ 457, టి.పవిత్ర 455, బి.ప్రవల్లిక 455 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో రిషిక ఆచారి 989, పి.సందీప్ 989, లోహిత్ 985, సంధ్య 979, ఓంకార్ 979 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కవి బాబు, శ్రీరామ్మూర్తి తెలిపారు.

'సూర్యతేజ' ప్రభంజనం

పలాస: ఇంటర్ ఫలితాల్లో కాశీబుగ్గ సూర్యతేజ కళాశాల ప్రభంజనం సృష్టించింది. హెచ్ఇసి మొదటి సంవత్సరం చదువుతున్న కోనారి లక్ష్మీప్రియ 500 మార్కులకు గాను 484 మార్కులు సాధించి రాష్ట్రటాపర్‌గా నిలిచింది. బొమ్మాళి వాసవి ఎంపిసిలో 465 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఎంపిసిలో కొత్త లత 464, వూన రోషిణి 464, బెవర రాగసుధ 463, జనని 462, మండల పవిత్ర 462, నగిరి హన్సిక 462, బత్తిన హేమంత్ 461, కొవ్వూరు అమృత 460, బైపిసిలో అల్లు శాంతి 430, జి.ప్రియాంక 427, కె.పద్మజ 426, 400 మార్కులకు పైబడి 55 మంది విద్యార్థులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో బత్తిని పల్లవి 986 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. రాపాక ప్రసన్న 982, బమ్మిడి దేవకి 981, దట్టి ఐశ్వర్య 977, పొట్నూరు జాహ్నవి 977, గేదెల రాగిణి 970 మార్కులు సాధించారు. బైపిసిలో రాయల సాత్విక 985 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. తామడ హిందు 980, లింగం పావని 976, పోలాకి శృతి 974, మరో 45 మంది విద్యార్థులు 900 మార్కులు పైబడి సాధించి కళాశాల ప్రభంజనం సృష్టించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సూర్యతేజ కళాశాల ఛైర్మన్ దానేటి కామేశ్వరరావు, కరస్పాండెంట్ దానేటి పద్మజీ స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు.


స్వీట్ తినిపిస్తున్న పద్మజీ కామేశ్వరరావు

'నారాయణ'...

నారాయణ కళాశాలలో ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో గీతాంజలి బెహరా 967, సుగ్గు అంకిత 961 మార్కులు, అన్నాబత్తుల అనూషా 949, బైపిసికు చెందిన డిక్కల ప్రవళిక 948, పోతనపల్లి రోజాశ్రీ 939, కొండె లఖిత 935 మార్కులు సాధించారు. వీరికి కోస్టల్ డిఎం డి.మధు, హనుమంతు, ప్రిన్సిపాల్ ఉప్పాడ వెంకటేశ్వరరావు, ఎజిఎం బమ్మిడి నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'విద్యావాహిని'...

కాశీబుగ్గ విద్యావాహిని కళాశాలకు చెందిన ఎంపిసి ఇంగ్లీష్ మీడియాకు చెందిన పల్లి ప్రవళిక 463, ద్వితీయ సంవత్సరం ఎంపిసి ఇంగ్లీష్ మీడియా విద్యార్థి లొల్ల మౌనిక 985 మార్కులు సాధించింది. 400 మార్కులకు పైబడి ప్రథమ సంవత్సవరంలో 60 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైబడి 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణతలు సాధించడంపై కళాశాల కరస్పాండెంట్ తిరుమలరావు, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిరుమలరావు

సత్తా చాటిన 'నారాయణ' విద్యార్థులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొదటి సంవత్సరంలో వెలమల లీలాకుమారి 466 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించగా, గురుగుబెల్లి రేణుక, గుండ దేవి ప్రియలకు వరుసగా 464, 464 మార్కులు చొప్పున సాధించారు. మొదటి సంవత్సరం బైపిసిలో పిసిని లిఖిత, ఊన్న వినీల కుమారి, మరపట్ల హర్షిత వరుసగా 431, 430, 430 మార్కులు సాధించినట్లు కళాశాల ఐఐటి సిఒ క్యాంపస్ ప్రిన్సిపాల్ పి.ప్రసన్న కుమార్, డీన్ మణికుమార్ ప్రకటనలో తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో బోగి సుష్మశ్రీ 986, అలుపాన సింధు 985, బాగు సుప్రియ 984 చొప్పున మార్కులు సొంతం చేసుకున్నారన్నారు.

శాంతి నికేతన్‌లో...

శాంతినికేతన్ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎల్. ఢిల్లేశ్వరి460, డి.శ్రావణి 455, టి. భాను ప్రకాష్, జి.జయ ప్రకాష్ 453 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో డి.మణి 979, డి.మహేష్ 973, బి.గణేష్ 972 మార్కులు సాధించారు. 400 మార్కులు పైబడి 30 మంది విద్యార్థులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 900మార్కులు పైబడి 20 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు విద్యార్థులను అభినందించారు.

చక్రధర్ విద్యార్థుల హవా

శ్రీకాకుళం అర్బన్: ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి జూనియర్ విభాగంలో లూకలాపు స్నేహ 470 మార్కులకు 465, కొయ్యాన లొకేశ్వరరావు 462, మహంతి సాయికుమార్ 462, మత్స సుస్మిత గీతాంజలి 460, అంగ దామోదరరావు 459 మార్కులు సాధించారు. వీరితో పాటు 450 పైబడి 15 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో కుంచాల రాకేష్ 977, లోపింటి తోషన్ 974, బస్వా శ్రీదత్తు 973, సైరిగాపు ప్రసన్నకుమార్ 972, బైపిసిలో మొదలవలస బిందు భార్గవి 972 మార్కులు సాధించినట్లు ఛైర్మన్ యాళ్ల చక్రధరరావు తెలిపారు.

'శ్రీవిద్య' విజయబావుటా


పూజిత
సమీర

సంతబొమ్మాళి : మండలంలోని ఇజ్జవరం శ్రీవిద్య జూనియర్ కళాశాల లో ద్వితీయ సంవత్సరంలో మార్పు పూజిత 964, పి.సమీర 944, బైపిసిలో గిన్ని స్రవంతి 963, కె.జీవిత 930, ప్రథమలో దండాసి ప్రవళిక 445, ఆర్.దివ్య 444, బైపిసిలో ఊట్ల సమిత 408, హెచ్ఇసిలో సెవ్వాకుల ధనరాజ్ 434 మార్కులు సాధించారు. వీరికి కళాశాల ఛైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కరస్పాండెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపాల్ ఆర్.రామారావు శుభాకాంక్షలు తెలిపారు.

మెరిసిన 'బిఎస్‌జెఆర్' విద్యార్థులు

టెక్కలి : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బిఎస్‌జెఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసి చదివిన మృగ్గ దివ్యశ్రీ 988 మార్కులు సాధించి టెక్కలి పట్టణంలో ప్రథమ శ్రేణిలో నిలిచిందని అన్నారు. తమ కళాశాల్లో ద్వితీయ సంవత్సరం చదివిన మరో 30 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించి ప్రతిభకనబరిచారని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివిన గంగెట్ల హారిక ఎంపిసి గ్రూపులో 456 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. హెచ్ఇసి గ్రూపులో శంకు సుధీర్ 470 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారని అన్నారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కోత మురళీధర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.


మాట్లాడుతున్న మురళి

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

కంచిలి: నియోజకవర్గంలోని ప్రధాన రైతాంగ సమస్యల పరిష్కారమే అజెండాగా రానున్న ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు చొట్రాయిపురానికి చెందిన బడ్డీ మురళి తెలిపారు. కంచిలి రాధాకృష్ణ మందిరం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతుల సమస్యలను విస్మరించాయని, వాటి పరిష్కారమే లక్ష్యంగా తమ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేస్తున్నారని అన్నారు. ఇచ్ఛాపురంలోని ప్రధాన సమస్యలపై గళ మెతుతానని అన్నారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ప్రజల్లోకి వెళ్తానని తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

టెక్కలి : ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీలో చేరేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలోని పలు కోర్సులకు సంబంధించి విద్యార్థులు చేరేందుకు వీలుగా సీట్ల సౌకర్యం కల్పించామని అన్నారు. కళాశాలలో చదువుకు సంబంధించిన కోర్సులతో పాటు ఉపాధి ఆవకాశాలు కల్పించేందుకు వీలుగా కోర్సులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పి.వి పురంలో వైద్య శిబిరం

నందిగాం : మండలంలోని ప్రతాప విశ్వనాథపురంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.సుకన్య 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇటీవల ప్రతాప విశ్వనాథంలో జ్వరాలు అనే శీర్షికతో వెలువడిన వార్తకు వైద్యులు స్పందించారు. ఈ మేరకు రక్తనమూనాలను పరీక్షించారు.


నందిగాం : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఓవిపేటలో...

బూర్జ : మండలంలో ఓవిపేటలో శుక్రవారం గుత్తావల్లి పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 320 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందజేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి రోజా మాట్లాడుతూ ఆరోగ్య సురక్షతో గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. రిఫరల్ కేసులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు తీవ్రత అధికంగా ఉన్నందున డీ హైడ్రేషన్ రాకుండా ద్రవపదార్థాలు కూడా అధికంగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు కె.సంజయ్‌కుమార్, కంటి వైద్య నిపుణులు ప్రసాదరావు, సిహెచ్‌ఒ శ్రావణి, ఎఎన్ఎం సత్యవతి, సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామారావు మృతి తీరని లోటు


మాట్లాడుతున్న సర్పంచ్ పురుషోత్తం

ప్రజాశక్తి- సోంపేట

వ్యాపారవేత్త నల్ల రామారావు ఆకస్మిక మృతి సొండి సంక్షేమ సంఘానికి ఎంతో తేరని లోటని డి.ఎఫ్.ఓ ఉత్తర కవాటం కోటేశ్వరరావు, సర్పంచ్ జగన్నాథం పురుషోత్తం అన్నారు. మండలంలోని హరిపురంలోని రామారావు ఇంటి వద్ద శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో సౌమ్యుడిగా పేరుపొందిన రామారావు మృతి తీరని లోటు అన్నారు. సొండి రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రామారావు ఎంతో సహృదయులని, అతని మృతి సంఘ అభివృద్ధికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ఎస్.గురుమూర్తి, శ్రీధర్, ఎస్.షణ్ముఖరావు, కె.గురునాథం పాల్గొన్నారు.

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తాం

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- పలాస

గిరిజనుల అభ్యున్నతికి జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హామీ ఇచ్చారు. మందస మండలం కొండలోగాం, తంగరపుట్టి, చీపి, సాబకోట, కొంకడా పుట్టి, బుడారసింగ్ తదితర గిరిజన ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఐటిడిఎ పక్క జిల్లాకు వెళ్లిపోతున్నా వైసిపి నాయకులు ఆపలేకపోయారని విమర్శించారు. జిల్లాలో గిరిజనులు ఉన్నా వారి సమస్యలు పరిష్కారానికి ఐటిడిఎ జిల్లాలో కొనసాగించాలని కోరినా వైసిపి నాయకులు పట్టించుకోలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్కకు మళ్ళించి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు పక్కకు మళ్లించకుండా గిరిజనుల అభివృద్ధి కోసం వెచ్చిస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గిరిజన గ్రామాలను గాలికి వదిలేశారని, కనీసం రోడ్లు, కాలువలు కూడా నిర్మాణం చేపట్టలేదని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సవర రాంబాబు, సవర రాజు, సవర శంకర్, సవర ధర్మరాజు, సవర లఖ్యాకుమారి, సవర సోమయ్య, సవర మోహనరావు, సవర సోమేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, శిరీష

టిడిపి విస్తృత ప్రచారం


కోటబొమ్మాళి : ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- బూర్జ

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కులవృత్తుల వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని మాజీ విప్, ఆమదాలవలస నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని కురుంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెంకటేష్ కులవృత్తిదారులకు ఎటువంటి న్యాయం జరగలేదని, తాము అన్ని విషయాల్లోనూ వెనుకబడి ఉన్నామని ప్రేమ్‌కుమార్ వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు, ఆమదాలవలస నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాంబాబు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు కొత్తకోట నాగేందర్, ఎంపిటిసి విక్రం, సర్పంచ్‌లు గణపతిరావు, టిడిపి నాయకులు పీరికట్ల ప్రభాకరరావు, సీత బాబు పాల్గొన్నారు.

పలువురు చేరిక

మండలంలోని నీలంపేట, కొరగాం, చీడివలసకు చెందిన వైసిపి నాయకులు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో కొరగాంలో పార్టీలో చేరారు. నీలంపేట నుంచి పది కుటుంబాలు మంగి నారాస్వామి, ఈదిపల్లి రమణమూర్తి, సాయిరాం, నాగరాజు, కొరగాం పంచాయతీ నుంచి 50 కుటుంబాలు, చీడివలస పంచాయతీ నుంచి మూడు కుటుంబాలు టిడిపిలో చేరారు.

ఆమదాలవలస: మండలంలోని సైలాడ పంచాయతీ సైలాడ, దివాంజీపేట, కుమ్మరిపేటలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థులైన కూన రవికుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, కోరుకొండ రమణమూర్తి, గొర్లె సూర్యం, బాలి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరాన్ని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేసారు. సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నగరంలోని పాత 8వ డివిజన్‌లో బుర్రిమధు, ధర్మారాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని వీధుల్లో పార్టీ శ్రేణులతో కలసి పర్యటించిన శంకర్ ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. డివిజన్ నాయకులు యోగేశ్వరరావు, విజయ్ కుమార్, సద్గుణరావు, మున్నా షేక్, రవికుమార్, వెంకటరావు, శ్రీనివాసరావు, నాయుడు పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టనంలోని జగన్నాథపురం, పెద్దపేట, నెయ్యిలవీధి, తెలగ వీధి పరిధిలో టిడిపి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తికి మద్దతుగా టిడిపి నాయకులు రాములాల్, జి.చిట్టిబాబు ప్రచారం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ 7వ వార్డు పురుషోత్తపురంలో ఎన్‌డిఎ అభ్యర్థులు ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్దాల నిర్మలారెడ్డి, ఆశి సత్యం, అనపాన కేశవ, దాసరి రాజు, తిప్పన దుర్యోధన, భాస్కర్ పాల్గొన్నారు.

టెక్కలి : సంక్షేమ టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని మున్సభుపేట, ధర్మనీలాపురం, చిన్ననారాయణపురం, జయకృష్ణాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, మట్ట పురుషోత్తం, బెహరా కాళి, లవకుమార్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


బూర్జ : టిడిపిలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్

కోటబొమ్మాళి : మండలంలోని తులసిపేట, చిట్టేవలసలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా తులసిపేటలో ఇద్దరు వాలంటీర్లు పట్ట కాశీపతి, తోట సింహాచలంలు టిడిపిలోకి చేరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టిడిపి మహిళా అధ్యక్షులు పూజారి శైలజ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

వాలంటీర్ల రాజీనామాలను ధ్రువీకరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలోని వాలంటీర్లు చేసిన రాజీనామాలను అధికారులు వెంటనే ధ్రువీకరించి బహిర్గతం చేయాలని టిడిపి రాష్ట్ర న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్లు రాజీనామాలు చేసినట్లు ప్రకటించి వైసిపి ప్రచారంలో పాల్గొంటున్నారని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్ తక్షణమే ఎంతమంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు, వాటిని ఆమోదించిన విధానాన్ని, నోటీసు బోర్డు ద్వారా బహిర్గతం చేయాలన్నారు. లేనియెడల రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని విద్యాసాగర్ హెచ్చరించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి వాలంటీర్ల రాజీనామాలపై అధికారులు దాగుడు మూతలు వీడి అధికారులు చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తులు అధికార పార్టీ అందిస్తున్న తాయిలాలకు దూరంగా ఉండాలని లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ చర్యలకు గురికావద్దని కోరారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్‌లు, ఎస్‌హెచ్‌జి గ్రూపుల సభ్యులకు వైసిపికి ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్నారన్నారని, దీనిపై అన్ని ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, తంగి గురయ్య, సంపదరావు మురళీ, గొండు రమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుదర్శన్‌దొర

పక్కాగా హోం ఓటింగ్‌పై సర్వే

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నియోజకవర్గంలోని వికలాంగులు, వయో వృద్ధుల ఓటర్లను కలిసి ఓటింగ్‌పై వివరాలు సేకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బిఎల్‌ఒలు, సెక్టార్ ఆఫీసర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 4,674 మంది వికలాంగులు, వయో వృద్ధులు ఉన్నారని అన్నారు. ఇంటింటికీ వెళ్లి హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు.


ప్యానల్ బోర్డు ద్వారా ప్రశ్న వినిపిస్తున్న ఉపాధ్యాయులు

టోఫెల్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన టిఒఇఎఫ్‌ఎల్ (టోఫెల్) (టెక్స్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్ష శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇతర దేశాల్లో స్థిరపడేందుకు వీలుగా, ఇతర దేశాల్లో విద్యాభ్యాసం చేసుకునేందుకు వీలుగా ఇతర దేశాల్లో ఆనుసరించే ఇంగ్లీష్‌లో మాట్లాడంపై ఉన్న మెలకువలను నేర్పారు. ఈ విద్యాసంవత్సరం మధ్యలో టోఫెల్ విధానాన్ని విద్యాశాఖ ప్రవేశపెట్టింది. ఈ మేరకు విద్యార్థులకు వినూత్నంగా గంటన్నర పాటు ఈ పరీక్ష నిర్వహించారు. అన్ని పాఠశాలలకు పంపిణీ చేసిన ఐఎఫ్.ఎల్ ప్యానల్ బోర్డు ద్వారా ఇంగ్లీష్ వాక్యాలను చదివించి దాని ఆధారంగా ప్రశ్నాపత్రంలో ఉన్న ప్రశ్నలకు జవాబులు రాయించే విధానం ద్వారా పరీక్షలు నిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు కోరారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి ఒకసారి కూడా నీరు సరఫరా చేయలేకపోతే ప్రజలు ఏలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రతి వార్డుకూ తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాగునీటి కోసం మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే కాకుండా ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సప్ప నవీన్, మల్లా శ్రీను, రవిశంకర్ గుప్త, డొక్కరి శంకర్, హరి కిరణ్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ఆమదాలవలస: మే 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో నైతిక విలువలు పాటిద్దాం.. నిజాయితీగా ఓటు వేద్దామని మండల ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మహిళా సంఘాలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తురకపేట, వెదుళ్లవలస, బొబ్బిలిపేట గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటే మన ఆయుధం చేజార్చుకోకు వచ్చిన అవకాశం అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు పైబడిన వయోజనులందరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, రామప్పడు, అధ్యక్షురాలు నక్క లత, విఒఎ రాజకుమారి, గ్రామ సంఘం లీడర్లు లక్ష్మీ, కాంచన పాల్గొన్నారు.

అలాగే మెప్మా టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్ కె.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఓటుహక్కు చైతన్యంపై (స్వీప్) అవగాహనలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కార్యక్రమం నిర్వహించారు. అర్హులందరూ తప్పనిసరిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, సిబ్బంది, ఆర్‌పిలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: అబాగ్యులకు అన్నదానం గొప్ప ఆలోచనని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం నగరంలోని గొంటివీధిలో పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థలో నిస్సహాయులకు సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యాన ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సహాయులకు అన్నంపెట్టడం ఆనందంగా ఉందన్నారు. అలాగే అరసవల్లి, ఏడు రోడ్ల కూడలి, డే అండ్ నైట్, సెల్టర్ హోంలో ఉన్న వారికి అందజేశారు. కార్యక్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పొడుగు చరణ్, రాజు యాదవ్, జీల్ ఫౌండేషన్ జాడ సాయి, నంది ఉమా శంకర్, ఉర్లం శివతేజ పాల్గొన్నారు.


ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న వేణుగోపాల్

సత్తా చాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు


చింతాడ తేజస్వి


వజ్జ స్వాప్నిక


బడే నీలవేణి


సీరపు కార్తీక్


కర్ని రాజేశ్వరి

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మండలంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ సత్తాను చాటారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి 66 మంది విద్యార్థులకు 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. అలాగే ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 100 మంది విద్యార్థులకు 83 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. అలాగే లోలుగు కెజిబివి పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 34 మంది విద్యార్థులకు 29 మంది ఉత్తీర్ణులు అయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 26 మంది విద్యార్థులకు 21 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య తెలిపారు. సిస్టమ్ కళాశాలలో ఎంపిసి ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో కె.హర్షవర్ధన్ 455 మార్కులు, ఐ.దేవయాని 427 మార్కులు, కె.మౌనిక 426 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎ.కావ్య 974 మార్కులు, కె.ఇందు 964 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు తెలిపారు. అలాగే గోరింటకు చెందిన చింతాడ తేజస్వి ఫస్ట్ ఇయర్ బైపిసిలో 440 మార్కులకు 435 మార్కులు సాధించింది. ఈమె వేలివెన్నులోని శశి కళాశాలలో చదువుతుంది.

బూర్జ: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో మండల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మండలంలోని ఓవిపేట ఆదర్శ పాఠశాలలో అల్లు మౌనిక ఎంపిసి 1000/973 మార్కులు, లిమ్మక స్మైలీ 1000/942 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి శ్రీనివాసరావు తెలిపారు. కొల్లివలస అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పరీక్షలకు హాజరైన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో అరసాడ కరుణాసాగర్ ఎంపిసి 1000/982 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. అలాగే బైపిసిలో పొట్నూరు నానిబాబు 1000/918 మార్కులు, సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పొందూరు సూర్యనేత్ర ఎంపిసి 450 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఎం అభిషేక్ ఫస్ట్ బైపిసి 470 మార్కులకు 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి విద్యార్థిని ఎ.ద్రాక్షాయిని 1000/937, సద్దడి జ్యోత్స్న 100/928, బైపిసి విద్యార్థిని తేజేశ్వరి 1000/830, సిఇసిలో బి.నందిని 1000 /828, కె.పావని సిఇసి 1000/828 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తవిటినాయుడు తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరంలో విద్యార్థినిలు మజ్జి లావణ్య, ఎ.వెంకటలక్ష్మి అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ప్రిన్సిపాల్ తవిటి నాయుడుతో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నందిగాం : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 80 శాతం, ద్వితీయ సంవత్సరం 79 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఆర్.జనార్ధనరావు తెలిపారు. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాల ప్రథమ సంవత్సరంలో 79 ఉత్తీర్ణం, ద్వితీయ సంవత్సరం 64 శాతం ఉత్తీర్ణ సాధించారని ప్రిన్సిపాల్ బి.దమయంతి తెలిపారు. ప్రథమ పి.భవాని 416, ద్వితీయ డి.సోనియా 826 మార్కులు అత్యధికంగా సాధించినట్లు తెలిపారు.

కంచిలి : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కంచిలి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. ఎమ్మెస్ పల్లి మోడల్ స్కూల్‌కు చెందిన పి.కావ్య 976, బి.సోనీ 953, ఎం.దిల్లేశ్వరి 959 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో పిట్ట పుష్ప 449, జి.స్రవంతి 413, బి.ఢిల్లేశ్వరి 413 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. అలాగే కంచిలి జూనియర్ కళాశాలకు చెందిన ఎం.సిరివెన్నెల 961, సరిత నాయక్ 953 మార్కులు, శ్రీదేవి బెహరా 942 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జగదీష్ తెలిపారు. జాడపూడి కస్తూరిబా పాఠశాలలో డి.తులసి 943, బి.దీపిక 436 మార్కులు సాధించారు. కంచిలి గురుకుల పాఠశాలకు చెందిన లక్ష్మీసాకేత్ 959, విష్ణు 430 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అప్పారావు తెలిపారు.

కొత్తూరు : ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ ఎంపిసిలో పి.కావ్యశ్రీ 933, వైసిపిలో లోతుగెడ్డ హేమాని 849, హెచ్ఇసిలో స్వప్నదాస్ 845, సిఇసిలో బెండి అమూల్య 860, ఎఅండ్‌టిలో గొర్లె అరుణకుమారి 898 మార్కులు సాధించారు. ప్రథమ ఎంపిసిలో కోమనాపల్లి సరిత, 424, బైపిసిలో కారక అక్షయ 404, సిఇసిలో లావేటి స్రవంతి 414, హెచ్ఇసిలో 338, ఒఎస్‌లో కె.శ్రీహరి 473, ఎఅండ్‌టిలో గొర్లె జ్ఞానేశ్వరి 465 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ తెలిపారు.

మెళియాపుట్టి : ఇంటర్ ఫలితాల్లో మండలంలో చాపర ఎస్‌కెకె ప్రయివేటు జూనియర్ కళాశాల హవా కొనసాగిందని ప్రిన్సిపాల్ పైడి పద్మావతి తెలిపారు. మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్.దయానంద్ తెలిపారు.

పలాస : ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసికు చెందిన నెహరిక 982, బెహరా పార్వతి 920, ఎంపిసిలో బెహరా గాయత్రి 966, సవర రాజు, బెహరా దీప 951, నాయిక్ సౌమ్య 931, సిఇసిలో డి.ప్రసాదరెడ్డి 877, హెచ్ఇసిలో సబర్ నయామి 843, కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజినీరింగ్‌లో ఎస్.సంజీత్ కుమార్ 921, ఎం.నీలిమా 902, ఎ అండ్ టి గ్రూపులో కె.అంజలి 796, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో హెచ్ఇసిలో సవర రేణుక 459, సిఇసిలో ఎస్.కమల 427, సిఎస్ఇలో జి.స్రవంతి 442, ఎస్. హేమంత్‌కుమార్ 415, బైపిసిలో ఎస్.మౌనిక 418, ఎంపిసిలో ఆర్.బికాస్ 382 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహమూర్తి తెలిపారు.

వజ్రపుకొత్తూరు : ఇంటర్ ఫలితాల్లో గోవిందపురం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ పట్నాయక్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో చింత ఝాన్సీ 905, ప్రియాంక 869, ఎంపిసిలో గుంటు శైలజ 842 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం సిఇసిలో సురాడ హరిక 409, బైపిసి టెంక సంధ్య 372, ఎంపిసి జుత్తు జాహ్నవి 308 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

టెక్కలి : ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసిలో గౌడు మనోజ్‌కుమార్ 948, అనంతు పద్మ 943 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డివిఇఒ కోట ప్రకాశరావు తెలిపారు. బైపిసిలో జుట్టు స్రవంతి 962, సవర ప్రమీళ 954 మార్కులు సాధించారన్నారు. హెచ్ఇసిలో సోడంగి ప్రవీణ్‌కుమార్ 821, భైరి సుజాత 803, కొమర స్వాతి 803 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ ప్రథమ ఎంపిసిలో దళింబో నాయకో 441, సతివాడ శృహు 427 మార్కులు సాధించారన్నారు. బైపిసిలో పడాల హేమామాలిని 413, హెచ్ఇసిలో సవర ప్రదీప్ 454, సోడంగి రొహిణీ 440 మార్కులు సాధించి ప్రతిభకనబరిచారని తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వట్టికూళ్ల కిరణ్మయి, ఆజయ్, విజయ్‌కుమార్ అభినందించారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో నౌపడకు చెందిన సీరపు కార్తీక్ 959 మార్కులతో ప్రథమ స్థానం, బి.పావని 942 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. బైపిసిలో ఉద్దాన రామకృష్ణాపురానికి చెందిన కర్ణి రాజేశ్వరి 958 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 108 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 92.6 శాతం వంద ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత ఫలితాల్లో 127 మంది పరీక్ష రాయగా, 51 శాతంతో 66 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం బైపిసిలో కింతల సాహితీ 413 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

కెజిబివి...

కవిటి : మండలంలోని కొత్తపాలెంలోని కెజిబివిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిఇసిలో బడే నీలవేణి 948, దున్న మంజు934, చీకటి పూజ 926 మార్కులతో సత్తాచాటారు. నీలవేణి కెజిబివిలో జిల్లా టాపర్‌గా నిలిచారు. మొత్తంగా 24 మంది విద్యార్థులకు, 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు.

పోలాకి: ఇంటర్ ఫలితాల్లో ప్రథమ ఇంటర్ ఎంపిసిలో పిరియా తేజేశ్వరి 448, బైపిసిలో బొజ్జ భార్గవి 432, ఎంఇసిలో ఇప్పిలి చాతుర్య 363, సిఇసి హనుమంతు లీల 360 మార్కులు సాధించారు. 92 మందికి 66 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కత్తిరి మంజు 996, బైపిసిలో బడగల చాందన 996, సిఇసిలో నార లావన్య 830, ఎంఇసిలో పూతి మానస 875 మార్కులు సాధించారు. 116 మందికి గాను 102 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరికి ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సరుబుజ్జిలి : ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో గుండు చాందిని 951 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. వృత్తి విద్యకు సంబంధించి సవర రాజు 903 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.

నరసన్నపేట : ఇంటర్ ఫలితాల్లో కోట్ని కావ్య 871 మార్కులు, బైపిసిలో ఆర్.హేమలతకు 860, సిఇసిలో ఆర్.శిరీషలకు 839 మార్కులు వచ్చాయి. మొదటి సంవత్సరం ఒకేషనల్ విభాగం నుంచి పి.శ్రావణి, ఎల్.శ్రావణిలు 473 మార్కులు సాధించారు. వాడవలస రామకృష్ణ, 459, యమునకు 450 మార్కులు, ఎంపిసిలో వంకల సమీర 446, కె.రాజేశ్వరి 440, బైపిసిలో కుమ్మరి సావిత్రికి 406 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


వై.నిహారిక


తనూజ


శ్రావణి


ప్రవల్లిక


వసంత


మెగనాత్

రణస్థలం: మండలం కొండములగాం మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.సుజాత 980/1000, బైపిసిలో సిహెచ్ రూప 917/1000, సిఇసిలో జి.అశోక్ 892/1000 సాధించారు. మొత్తం 71 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 83 శాతం ఉతీర్ణత సాధించారు. అలాగే మొదటి ఏడాది 76 మంది విద్యార్థులకు 58 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 76 శాతం ఉతీర్ణత సాధించారు. ఎంపిసిలో ఎస్.దివ్య 458/470, బైపిసిలో ఆర్.అనుశ్రీ 410/470, ఎంఇసిలో కె.జాహ్నవి 347/500, సిఇసిలో ఎం.తేజేశ్వరరావు 411/500 ఉతీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయుటకు మే 22 గడువు ఉన్నట్టు తెలిపారు.

మురపాక కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

లావేరు: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో మురపాక కస్తూరి బా గాంధీ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 89 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఎంపిసి గ్రూపుల్లో పాసయ్యారు. ఫస్ట్ ఇయర్ 38 మంది పరీక్షకు హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండ్ ఇయర్ 37 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించినట్టు కెజిబివి ప్రత్యేకాధికారిణి బల్ల సుధారాణి తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో జి.మనీషా 415 మార్కులు, జి.సాయి 410 మార్కులు సాధించారు. సెకెండ్ ఇయర్‌లో కొన్ని శ్రావణి 936, దున్న ప్రవల్లిక 919, గురుగుబిల్లి ఝాన్సీ 908 మార్కులు సాధించి సత్తాచాటారు.

ఇంటర్ ఫలితాల్లో కెజిబివి విద్యార్థులు హవా

జి.సిగడాం : మండలంలో ఇంటర్ ఫలితాల్లో కెజిబివి కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 36 మందికి 19 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 31 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో వై.నీహారిక 470 మార్కులకు 426, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎం.తనూజ 928 మార్కులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

మెరిసిన మోడల్ కళాశాల విద్యార్థులు

మండలంలో ఆదర్శ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 92 మందికి 73 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 83 మందికి 65 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో ఎ.సంధ్య 470 మార్కులకు 442, కె.రాజు 440, కార్తీక 433 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మెగనాత్‌కు 1000 మార్కులకు 949, వై.వి.రమణి 943, కె.వసంత 932 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ తెలిపారు.

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం


వజ్రపుకొత్తూరు : పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అభివృద్ధి, సంక్షేమం వైసిపితో సాధ్యమని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బైపల్లిలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మేరకు మోస బాబూరావు, మైలపల్లి ధనరాజ్, డొంక ఉగాది, పి.రాజేశ్వరి, తెప్పల రామకృష్ణ, తామాడ అర్జున, రాజేష్ తదితర 25 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనపై యువత ఆకర్షితులవుతున్నారని అన్నారు. సంక్షేమం అందించడంలో ఎటువంటి వివక్షకు తావు లేకుండా అన్ని తరగతులకు సంక్షేమం అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, బైపల్లి సర్పంచ్ ప్రతినిధి డొంక విద్యాసాగర్, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇరోతు హేమంతరాజు, మామిడి గోపి పాల్గొన్నారు.

పోలాకి : రానున్న ఎన్నికల్లో విజయం సాధించేది వైసిపినేని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు అన్నారు. మండలంలోని తలసముద్రం పంచాయతీలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, ధర్మాన రామలింగం నాయుడు, పార్టీ అధ్యక్షులు కణతి కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు పాల్గొన్నారు.


పోలాకి : ప్రచారం చేస్తున్న కృష్ణదాస్

బూర్జ: అధికారం చేజిక్కించుకోవడం కోసం పార్టీలన్నీ యాకమైనప్పటికీ ఒరిగేది ఏమీ లేదని జిల్లా క్రీడల అధ్యక్షులు తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు మండలంలోని పాలవలసలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలన్నీ కూటమిగా ఏర్పాటయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, గుమ్మడి రాంబాబు, సర్పంచ్ అంబుజాక్షి, జల్లు బలరాం నాయుడు, సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, సర్పంచ్‌లు వియ్యపు కృష్ణ, జడ్డు మహేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజులు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, ఎంపిటిసి బొడ్డు చెంచులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శ్రీకాకుళం అర్బన్: నగర శివారులో ఉన్న 33/11 కెవి పాత్రునివలస జెహెచ్‌సి (టిడ్కో) విద్యుత్ ఉప కేంద్రానికి కొత్తగా 11 కెవి విద్యుత్ లైన్లు వేయడం జరుగుతోందని, దీనివలన శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఇఇ ఆపరేషన్ ఎస్. బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. దీంతో టిడ్కో, పాత్రునివలస, డెంటల్ కాలేజ్ ప్రాంతాల్లో పాక్షికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. **కవిటి:** మండలంలోని బొరివంక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి లైన్ మైంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, బొరివంక, బిజి పుట్టుగ, ఇద్దివానిపాలెం, దూగానపుట్టుగ, వరక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు..

సోంపేట: మండలంలోని కొర్లాం సబ్ స్టేషన్ 11కెవి ఉద్దానం, సోంపేట సబ్ స్టేషన్‌లో 11కెవి బారువా ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పలాస ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బారువా, గొల్లగండి, చేపల గొల్లగండి, కొర్లాం, లక్కవరం, పలాసపురం, బెంకిలి, జింకిభద్ర తదితర గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మద్య నిషేధం పేరుతో రూ.కోట్లు లూటీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గత ఎన్నికల్లో మద్య నిషేదాన్ని అమలు చేస్తానని నమ్మించి మహిళల ఓట్లు దండుకున్న జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల తర్వాత హామీని మరచి తన బ్రాండ్ మద్యం మార్కెట్లో అమ్మి రూ.కోట్లు లూటీ చేశారని కూటమి నాయకులు పిఎంజె బాబు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పిసిని చంద్రమోహన్‌లు ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మద్యం ద్వారా దోచుకున్న రూ.లక్ష కోట్లు కంటెయినర్లలో తరలించి ఎన్నికల్లో వాడేందుకు నియోజకవర్గాలకు తరలించారని ఆరోపించారు. 2020లో క్రిసిల్ చేసిన సర్వే ప్రకారం ఎపిలో దాదాపు 34.5 శాతం మంది మద్యం సేవిస్తున్నారని, 2021లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో కూడా దాదాపు 31.4 శాతం మంది మద్యం సేవిస్తున్నారని స్పష్టమైందన్నారు. గతంలో 10 నుంచి 12శాతం మాత్రమే ఉండే మద్యం తాగేవారి సంఖ్యను పెంచి యదేచ్చగా తాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయ కులు సూరిబాబు,రామరాజు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు


చికిత్స పొందుతున్న మహేష్, మాధవ

కార్మికులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపాలిటీలో పనిచేస్తున్న నీటి సరఫరా విభాగం కాంట్రాక్టు కార్మికులపై శుక్రవారం తేనె టీగలు దాడి చేశాయి. నీటి సరఫరా విభాగం కాంట్రాక్టు కార్మికులు ఎస్.మాధవ, మహేష్, పలాస సీతమ్మ ఆలయం ఎదురుగా పైపులైన్ పనులు చేస్తున్నారు. సమీపంలో పంట పొలంలో ఒక రైతు పొగ పెట్టడంతో ఒక్కసారిగా తేనె టీగలు వారిపై దాడి చేసి గాయపరిచాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

మూకుమ్మడిగా వాలంటీర్ల రాజీనామా

సోంపేట : మండలంలోని బేసి రామచంద్రపురం, పెంకిలి, సోంపేట, గొల్లూరు, జింకిపద్ర తదితర గ్రామాలకు చెందిన వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను శుక్రవారం ఎంపిడిఒ రామారావుకు అందజేశారు. తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఇచ్ఛాపురం : మండలంలోని వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 17 మంది వాలంటీర్లు ఎంపిడిఒ వై.వి.రాజేంద్రప్రసాద్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు మండలంలోని మొత్తం 281 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని ఎంపిడిఒ తెలిపారు.

టెక్కలి : మండలంలోని లింగాలవలస సచివాలయం పరిధిలో 17 మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలను కార్యదర్శి పి.రవికుమార్‌కు అందజేశారు. గ్రామ వాలంటీర్లపై తప్పుడు ప్రసారం చేయడం మానుకోవాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు. రావివలస సర్పంచ్ సర్లాన బాలకృష్ణ ఆధ్వర్యాన 13 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు.

నేడు సంగీత లయ విన్యాసం

కవిటి: టుండలంలోని ప్రగడపుట్టుగలో రాజరాజేశ్వరి కలాపీఠం శ్రీకాకుళం వారిచే శనివారం సాయంత్రం సంగీత లయ విన్యాసం నిర్వహిస్తున్నట్టు కోదండ రామాలయం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర 53వ సుప్రభాత వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సోలో కచేరిలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ వయొలిన్, సుసరాపు కుమార్ విఘ్నేష్ మృదంగం, గొనప లక్ష్మణమూర్తి కంజిరాతో అలరించనున్నట్టు వారు తెలిపారు. సంగీత కళాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో మండుటెండలో ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న పోలీసులకు జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. నగరంలోని వివిధ కూడళ్ల వద్దకు మజ్జిగ చేర్చి వారికి అందజేశారు. జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు జాడ సాయి ఆధ్వర్యాన జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో జెసిఐ శ్రీకాకుళం మెయిన్ ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు. మజ్జిగతో సేదతీరిన పోలీసులు వారిని ప్రశంసించారు.

జనసేన ప్రధాన కార్యదర్శిగా సంతోష్

పలాస : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్ పండాను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. తనను ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై అధినేతకు, జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.